

# చెట్టంత మనిషి

పులికంటి కృష్ణారెడ్డి

"ఏడుస్తున్నావా బావా ?"

ఏడుస్తున్నది నేను !— అడుగుతున్నది పుష్పలత !!

నా ఎదురుగా పుష్పలత. పుష్పలత ఎదురుగా నేను. ఒకరికెదురుగా ఒకరు కూర్చున్నాం—అందాల ఆ తోటలో, ఒక చెట్టునీడలో, పూ పొదల మాటుతో ! —

ఎవరు ఏ మాత్రం ముందుకు వంగినా మూతిలో మూతి పెట్టినట్లుటుంది. అంత దగ్గరగా కూర్చుని చూస్తూ కూడా ఆ అమ్మాయి అడుగుతూ ఉంది.

ఏమని చెప్పాలి ?

నేను ఏడుస్తున్నాను. నిజమే ! రాయలసీమలో బానకుబాన పాతాళగంగను పైకి తెచ్చినా సాగని కాలువను చూచి సతమతమయ్యే సన్నకారురైతులా కాదు. ఎండిన కట్టెలాంటి తనువులో ఎంతసేపు చివికినా చేపని రొమ్ముల్ని చూస్తూ గుక్కపట్టి ఏడుస్తున్న పసిపాపలాకాదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకును మతకలహాలకు ఆహుతిచేసి 'అయ్యో !' మని విలపిస్తున్న తల్లిదండ్రుల్లాకాదు. మారణ హోమాల్ని చూస్తూ సహించలేక మథనపడే మానవతావాదిలా కాదు ఉన్నట్లుండి పదవి ఊడిపోతే లోలోన ఉడికిపోతున్న మంత్రిలాగా ఏడుస్తున్నాను.

నా గుండెలు ఉడుకుతున్నాయి. ఉడుకుతున్న గుండెలనుండి ఆవిర్లు లేస్తున్నాయి. లేచిన ఆవిర్లు కనుకొలకుల్లో తొంగి చూస్తున్నాయి. తొంగి చూస్తూ నిలబడలేక ఎవర్రో మెడబట్టి ముందుకు నెట్టినట్లు చెప్పకుండా చెందకుండా చెంపలమీదపడి అక్కడ కూడ నిలబడలేక జారిపోతున్నాయి.

పుష్పలత చూస్తూ ఉంది. చూస్తూ కూడా 'ఏడుస్తున్నావా బావా ?' అని అడుగుతూ ఉంది. బదులు చెప్పడం అనవసరం. అందుకే తల వంచుకొన్నాను.

అంతవరకు చెంపలమీద ధారలు కట్టిన కన్నీళ్లు రూపాంతరం చెందినాయి. బొట్లు బొట్లుగా నేల రాలుతున్నాయి. సంజ వెలుగులుపడేసరికి ఆ కన్నీటి బొట్లు గుండుముత్యాల్లా మిలమిలామెరుస్తున్నాయి.

పుష్పలత కిలకిలా నవ్వింది.

పిల్లికి చెలగాటం ! ఎలుకకు ప్రాణ సంకటం !!

పీటలమీదికి పోబోయే పెండ్లికూతురిలా భాగ్యనగరం అలకరించుకొంటూ ఉంది. ఆమెకు అలంకరిస్తున్న రవ్వల నగల్లా అక్కడొకటి అక్కడొకటి విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. పడుచుదనం హొయలు కురిసి 'పబ్లిక్ గార్డెను' మురిసిపోతూ ఉంది. నేను వంచిన తల ఎత్తకుండా ఏడుస్తూనే ఉన్నాను.

"బావా !"

పిలిచింది పుష్పలత.

పుష్పలత యిప్పుడేకాదు. నాకు పరిచయమయిన నాటినుండి 'బావా !' అని పిలుస్తూనే ఉంది.

అసలు పుష్పలతతో పరిచయమే అనుకోని విధం.

ఆనాడు ఎర్రని ఎండలో భాగ్యనగరం వీధుల్లో నడుస్తున్న అభాగ్యుల మధ్య పొగరుమోతు శ్వేతాశ్వంలా తెల్లటి అంబాసిడర్ కారు దూసుకపోతూ ఉంది. ఆ కార్లో ఒక ప్రక్కన నేను కూర్చున్నాను. నా ప్రక్కన ఆమె. ఆమె ప్రక్కన

పుష్పలత కూర్చున్నారు. ఆ 'ఆమె!' ఎవరన్న కుతూహలం ఎవరికైనా కలుగుతుంది. పేర్లు వగైరాలు వివరించి విసిగించడం నా అభిమతంకాదు. అట్లా వివరిస్తే ఆమెను కించపరచినట్లవుతుంది కూడా ! అందుకే ఆమెను ఆమెగానే పేర్కొంటాను. ఎందుకంటే ఎవరి ప్రక్కనైనా అదే రీతిలో కూర్చొనగల ఆమెకు ఎవ్వరూ ఏ స్థానాన్ని ఇవ్వలేరు. అయితే ఒక్కమాట మాత్రం నిజం ! ఆమె లేకపోతే జీవితమే లేదనుకొంటున్న రోజులవి!—

"నాన్నకు పక్షవాతం. పేదోళ్ళ బతుకులతో ఆడుకోవాలంటే ఈ దేవుడికెందుకో యింత పక్షపాతం. నాన్నగారికి ఒక కాలూ చెయ్యీ పడిపోయింది. మంచాన పడివున్నారు. "నువ్వు ముందా ? నేను ముందా ?" అని ఆయనతో పంతం వేసుకొన్నట్లు అమ్మ ఈ పొద్దో రేపో అంటూ వుంది. ఎంతో కష్టపడి యం. ఎ. దాకా చదివిస్తే కొరకరాని బతుకులకు కొరగాని చదువయింది. ఏం చెయ్యమంటారు చెప్పండి?— అందరూ వెంటబెట్టుకొని కులుకుదామనుకొనే వాళ్ళే కాని, కంట తడి తుడిచే వాళ్ళు కనబడడంలేదు. సాటి స్త్రీగా మిమ్మల్ని ఆశ్రయించినాను. ఏమి చేసినా మీరే దిక్కు. ఇవి చేతులుకాదు అక్కయ్యా!"

తారు రోడ్డు మీద కారు వేగంతో ఎకసక్కెములాడుతూంటే— పుష్పలత తన గోడు వెళ్ళబోసుకొంటూ ఉంది. చేతులు కాదంటూ, ఆమె చేతుల జోలికి పోకుండానే!—

"చూద్దాంలే పుష్పా!" అంటూ ఆమె తల పంకించింది. ఆమె అట్లా అంటూవుంటే రాజకీయ దర్పం సర్పంలా బుసలుకొట్టింది.

"అయితే నీవు నాకు మరదలివన్నమాట!" అన్నాను— అంతవరకు వివరించిన ఆమె కథనంతా కంచికి పంపి— కడపట అనిన 'అక్కయ్యా!' అన్న మాటను ఆసరాగా తీసుకొని. అప్పుడు అక్కడ నా మగబుద్ధి చాలా చురుకుగా పనిచేసింది.

పుష్పలత అదోరకంగా నావైపు చూచింది.

ఆ పరిస్థితిలో కూడా ఆమె కండ్లు నవ్వుతున్నాయి.

"మన హైందవ సంప్రదాయంలో బావ మరదలికి ఎంతటి గౌరవాన్ని యిస్తాడో—అంతటి గౌరవాన్ని యివ్వగల సంస్కారం మీకుంటే నిజంగా నేను మీ మరదల్నే!"

బాగా గురిపెట్టి కొట్టవలసినచోటనే కొట్టింది పుష్పలత. ఎంతయినా ఎం. ఎ. దాకా చదువుకొన్న అమ్మాయికదా?—

పుష్పలత కొట్టిన దెబ్బ అప్పట్లో చీమ కుట్టినట్లనిపించలేదు కానీ— నా ప్రక్కన కూర్చున్న ఆ 'ఆమె!' నా మగబుద్ధిమీద మోచేతితో దాడి చేసింది. కడుపులో దేవినట్లయింది. అలవాటుపడినాను కాబట్టి తమాయించుకొని 'నీకా సందేహం ఎందుకొచ్చింది లతా?" అన్నాను.

"మీకు సందేహం లేకుంటే నాకూ ఎలాంటి సందేహం లేదు"

అంతే!— ఆరోజు నుండి నేను బావ, పుష్పలత మరదలు. అప్పటినుండి 'బావా!' అని పిలుస్తూనే ఉంది. ఇప్పుడుకూడా 'బావా' అని పిలిచింది. అయితే

# చెట్టంత మనిషి

ఎంత తీపిని రంగరించిందో ఈ పిలుపులో ! ఎంత జాలిని మేళవించిందో ఈ పిలుపులో ! !— చెవుల్లో అమృతం కురిసినట్లయింది.

ఆమెవైపు చూడకుండా ఉండలేకపోయాను.

చూస్తే — కిలకిల నవ్వులు ఆమె కన్నుల్లో మిలమిలా మెరుస్తున్నాయి.

అసలు కన్నులతో నవ్వడమంటే పుష్పలతకు మహా సరదా!

మరొకప్పుడైతే—

"మరదలి కన్నుల్లో మధుర దరహాసాలు
బావకై పూచిన ముద్దమందారాలు" — అన్న పల్లవినందుకొంటే— కసక్కమని కొరికినట్లుగా ఆమె బుగ్గలు ఎరుపెక్కేవి. ఎరుపెక్కిన ఆ బుగ్గల్ని చూడడమంటే ఒక 'పెగ్' వేసినంత సంబరం.

అంత యిష్టమయిందా నవ్వు!—

అయినా ఈ రోజు చూడలేకుండా తల వంచుకొన్నాను.

ఎడమచేతి నడిమివ్రేలిని సరిగ్గా సగంలో చీలిన నా గడ్డం చీలికకు ఆనించి అలవోకగా నా తలను పైకి లేపింది పుష్పలత — గోవర్ధనగిరి నెత్తిన గోపాలుడిలా.

కన్నీటి తెరల మధ్య నే నామెను చూస్తున్నాను.

జాలిచూపుల కెరటాలతో ఆమె నన్ను ముంచివేస్తూ ఉంది.

'పబ్లిక్ గార్డెన్ రోడ్డు'లో రొదచేస్తూ పరుగిడుతున్న వాహనాల్లా నా తల నిండుకు ఆలోచనలు. ఒకదాన్ని దాటి మరొక్కటిగా దౌడు తీస్తున్నాయి. విద్యుత్కాంతుల్లో 'పబ్లిక్ గార్డెన్' తన అందాన్ని 'పబ్లిక్' చేస్తూ ఉంది. ఎవరో కలిగినవాడి పాపభీతికి ప్రతీకగా రూపొందిన దేవాలయం. అల్లంత దూరంలో గుట్టమీద వెండి వెలుగుల్లో కన్నుల పండువుగా వెలిగిపోతూ ఉంది. వీటన్నింటితో ప్రభావితం కాలేని నా గుండె నలిగిపోతూ ఉంది.

"లతా ! పల్లెపల్లెకూ ఓ బస్సు అంటున్నది ప్రభుత్వం. అటువంటి ఈ రోజుల్లోకూడా మూడు బస్సులు మారి నాలుగు మైళ్ళు నడిస్తేనే కానీ

## ప్రశ్న

నిన్నటి నా వాళ్ళు
దీర్ఘదర్శులై
అదే పనిగా శ్రమిస్తే
నేటి
నా జాతి సుఖ పడుతున్నది
నేటి నా వాళ్ళు
దీర్ఘసూత్రులై
ఇదే పనిగా నిద్రిస్తే
రేపటి
నా జాతి ఏం కానున్నది ?

— తిరునగరి

చేరుకోలేని మారుమూల గ్రామంలో పుట్టినాను. చదివిన చదువుకంటే లోకాన్ని చదివిందే ఎక్కువ. ఆ లోకజ్ఞానాన్ని పెట్టుబడిగా పెట్టినాను. ఈ ప్రయత్నం ఫలించి పదిమందికి మంచి జరుగుతుందనుకొన్నాను. కానీ..."

"అంతా విన్న సంగతే కద బావా !"

"నా యీ ప్రయత్నంలో ఎంతో నీకు చెప్పినాననుకొన్నా — చెప్పకుండా మిగిలిపోయిందికూడా ఎంతో వుంది. అనుభూతుల్ని మాత్రం నీకు వివరించినాను కానీ — పడిన అవస్థల్ని ఏకరువు పెట్టలేదు."

"నువ్వెన్నయినా చెప్పు బావా ! మతిలేనివాడిలా నువ్విలా మథనపడడం..."

"బాగా లేదంటావ్ !"

"బాగా లేదుకాదు, భావ్యం కాదంటాను."

"ఏం చెయ్యమంటావు లతా ! ఆ అనుబంధం, ఆత్మీయతలు మనస్సులో మెదిలినపుడు జరిగినదంతా కనుల ముందు రంగుల చిత్రంలా రమ్యంగా కనుపిస్తుంది. పడిన శ్రమను గుర్తు చేస్తుంది. కొన్ని యేండ్ల తరబడి పడిన శ్రమ నవ్వులపాలయిందని తోచేసరికి గుండె పగిలిపోతుందేమో ? — అనిపిస్తుంది."

"అది ధీరుడి లక్షణం కాదు బావా !"

"ధీరుడైనా, వీరుడైనా, మనిషే కదా ? మనిషికి మనస్సుంటుంది కదా ?"

"మనస్సున్న మనిషి కాబట్టే నిన్ను మనిషిగా ఆలోచించమంటున్నాను."

"అంటే..."

"అంటేనా బావా ! ఒక డాక్టరున్నాడు. అతని వద్దకు వచ్చే పొయ్యే ప్రాణాలతో వున్న ఒక రోగిని తీసుకొనివస్తారు. డాక్టరుగా అతని కర్తవ్యం యేమంటావ్ ? సర్వశక్తులు ధారపోసి అతనిని బ్రతికించడం. అట్లా బ్రతికించిన వ్యక్తి ఒక శాస్త్రజ్ఞుడే అనుకో ! ఆ శాస్త్రజ్ఞుడు తన పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమం కోసం వినియోగించకుండా జాతి వినాశనానికి ఉపకరించే మారణాయుధాల్నే కనిపెట్టాడనుకో! దీనికి డాక్టర్ ఎంతవరకు బాధ్యుడంటావ్ ?

"నన్నడిగితే డాక్టరలాంటి వ్యక్తిని బ్రతికించడమే తప్పంటాను."

"అక్కడే పొరబాటు పడుతున్నావు బావా ! — ఒక వ్యక్తిని బ్రతికిస్తే అతడు యింతమంది ప్రాణాల్ని తీస్తాడని డాక్టర్‌కు తెలియదు. ఒకవేళ తెలిసినా డాక్టర్ — డాక్టరుగా తన కర్తవ్యాన్ని నెరవేర్చక తప్పదు. తాను బ్రతికించిన ఆ వ్యక్తిని గురించి ఆ డాక్టర్ వాపోవడమెట్లో నీ యేడుపూ అంతే !" —

"అయితే నాది వట్టి యేడుపేనంటావా ?"


"కాకుంటే మరేమిటి బావా ?"

"అయితే ఆమెను అందల మెక్కించడం నా అవివేకమంటావ్ !"

"అందల మెక్కించడం అవివేకం కాదు. ఎక్కించినానని యేడవడమే అవివేకం !"

"అయితే ఏడవకుండా నవ్వమంటావా ?"

"నవ్వమని నేను చెప్పలేదు. అయితే బాధ పడద్దని మాత్రం చెపుతాను. ఎందుకంటే బావా ?




అడవిలో పువ్వులు పూస్తాయి. అవి మనిషికంట పడకుంటే అడవి పూలే అవుతాయి. మనిషి కాలి క్రింద పడితే నలిగిపోతాయి. మనిషి చేతపడితే— ఆ మనిషి ఒక పూజారి అయితే శివుడి శిరస్సునే చేరుతాయి. ఆ పూలను శివుని శిరస్సున చేర్చిన పూజారే మరలా శిరస్సువంచి ఆ పూలకే మొక్కుతాడు. తాను మొక్కడమేకాదు లోకమే మొక్కుతూవుంటే ఉప్పొంగిపోతాడు. కానీ ఆ పూలకు జరుగుతున్న గౌరవ మర్యాదల్ని చూచి నీ మాదిరి ఉక్రోషపడడు.''

"అయితే నాది పట్టి ఉక్రోషమేనంటావా ?''

"ఉక్రోషమనను కానీ ఉబలాటమంటాను.''

"ఉబలాటమా ! దేనికి ?''

"గుర్తింపు కోసం !''

"శ్రమపడినపుడు తగిన గుర్తింపు కోరడం కూడా తప్పేనంటావా ?''

"తప్పనను. కానీ తపన వద్దంటాను.''

"అయితే నాది కేవలం తపనేనంటావ్ !''

"కాకుంటే మరేమిటి బావా ? ఒక మనిషి పదిమందీ కాళ్ళతో తొక్కుతున్న మట్టినే సేకరిస్తాడు. నీళ్ళుపోసి తానూ తొక్కుతాడు. తొక్కిన మట్టిని ముద్దచేస్తాడు. ఆ మట్టి ముద్దను ఒక దేవతామూర్తిగా రూపొందిస్తాడు. మట్టి ముద్ద మూర్తిగా రూపొందిన మరుక్షణం నుండి వేలాదిమంది భక్తులు చేతులెత్తి ఆ మూర్తికి మొక్కుతారు. ముడుపులు కడతారు. మొక్కులు చెల్లిస్తారు. ఆ మట్టికి మహత్తునిచ్చిన నిర్భాగ్యుడు ప్రక్కనే ఉంటాడు. అయితే అతని నెవరూ గుర్తించరు. మరి ! గుర్తించలేదని అతడేమన్నా బాధపడుతున్నాడా ? లేదే ! పైగా తన రూప కల్పనకు జరుగుతున్న పూజా పునస్కారాలను చూచి పులకరించిపోతున్నాడే కానీ నీ మాదిరి పొక్కి పొగలడంలేదు.''

"అయితే నేను పొక్కిపొగులుతున్నానంటావా?''

"కాకపోతే మరేమిటి బావా ?''

"నేను పొక్కిపొగలడం నా కోసం కాదు లతా!''

"మరి ?''

"నా యీ కృషితో పదిమందికీ మేలు జరుగుతుందనుకొన్నాను. మేలు జరగకపోతేపోయింది. కీడు జరుగుతూవుందే !''

"ఇప్పుడు నీకొక కథ చెప్పాలి బావా !''

"ఇంకనూ నాకు కథలు వినే ఓపిక వుందను కొంటున్నావా లతా ? విని విని చెవులు తూట్లు పడినాయే !''

"కథంటే కథగాదు బావా ! కనులముందు జరిగిన వాస్తవం.''

"అయితే చెప్పు.''

"మా ఊళ్ళో బావా ! ఒక పేదరాలి పెద్దమ్మ. ఆ పేదరాలి పెద్దమ్మకు ఒక ముద్దుల కొడుకు. పేరు నాగరాజు. నాగరాజు తెలివితేటలా ? అద్భుతం. అందులో లెక్కలంటే అతడికి నీళ్లు తాగినట్లే. నాగరాజు తెలివితేటల్ని మెచ్చుకొని మా ఊళ్లో నలుగురూ నాలుగువిధాల సహాయపడినారు. ఆ పేదరాలు కూడా పట్టరానివాళ్ల కాళ్లుపట్టి చేతులుపట్టి నాగరాజును చదివించింది. నాగరాజు పట్టుబట్టి యింజనీరింగు పట్టభద్రుడైనాడు.

మా ఊరు చుట్టూ కొండలూ కోనలు. ఆ కొండల్లో పుట్టి పారుతుంది నాగులేరు. చిన్నప్పటి నుండి నాగరాజుకు ఆ నాగులేరుమీద కన్ను. ఏనాటికైనా నాగులేరుకు ఆనకట్ట కట్టి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్నది నాగరాజు కోరిక. ఇంజనీరు కావడంతో ఆ కోరిక మరింత బలపడింది.

రాయలసీమ సంగతి నీకు తెలియందేముంది బావా? జీవనదులు లేవు. రాయల కాలంలో కట్టిన చెరువులు. అవీ అంతంతమాత్రంగా మిగిలినాయి. కాగా రాయలసీమలో సేద్యానికి బావులే గతి. ఆ బావుల్లో తొలికోడి కూసేవేళకాడ కపిలకట్టి పొద్దు నడిమిట్టకొచ్చేదాకా 'రావన్న రావో!' అని మోట తోలితే ఎకరా పంటకు తడిపడడం దుర్లభం. దీనికితోడు ఈ సీమ మీద కరువు రక్కసికి ఎనలేని ప్రేమ. మూడు మూన్నాళ్లకు బొట్టూ కాటుక పెట్టి పిలిచినట్లు వచ్చి కూర్చుంటుంది. ఆ సమయాల్లో త్రాగడానికి నీళ్లు లేక తినడానికి తిండి లేక ఈ సీమ వాసులు 'అలో రామచంద్రా!' అని అలమటిస్తారు. వానాకాలంలో నాగులేరు గట్లుతన్ని పారుతుంది. ఆ నీళ్లను నిలవచేస్తే రైతుల బాధలు తప్పుతాయని నాగరాజు ఊళ్లో యువతరాన్ని ప్రేరేపించినాడు. నలుగుర్నీ కూడగట్టుకొన్నాడు.

కానీ — ఊళ్ళో ఒక తరం మనుష్యులు నాగులేరు జోలికి పోవడమంటే నాగుపాము జోలికి పోయినట్లే నన్నారు. కొందరు నాగులేరుకంటే నక్కలేరు నయమన్నారు. మరీ పెద్దవాళ్లు పిల్లకాకికేం తెలుసులే ఉండేలుదెబ్బ?! అని ఎగతాళి చేసినారు.

అయినా నాగరాజు పట్టిన పట్టు వీడలేదు!

ఒక యింజనీరుగా ఒక్క దినం కాదు. రెండు దినాలు కాదు. చాలా దినాలు ఎంతో శ్రద్ధగా ఆ చోటును పరిశీలించినాడు. పరీక్షించినాడు. ప్రయోజనం ఉంటుందనుకొన్నపుడే పని ప్రారంభించినాడు.

బావా! మానవుడు ప్రకృతిని జయించి తన పరిధిలోనికి తీసుకొంటే— మానవ కళ్యాణమే జరుగుతుంది. లేకుంటే – చెడు జరుగుతుంది. నాగరాజు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. నష్టాలను భరించినాడు. అవమానాల్ని సహించినాడు. రాళ్ల రప్పల పాలవుతున్న నాగులేటికి అడ్డుకట్టలు వేయించినాడు. తన ప్రయత్నం ఫలించినదని రొమ్మువిరుచుకొన్నాడు. అయితే బావా ! ఎక్కడో యేదో లోపం జరిగింది. ఉన్నట్లుండి ఆ కట్ట తెగిపోయింది. తెగిపోతే యేమయింది?— ఆ కట్టక్రింద ఎకరాలకొద్దీ పొలాలు నాశనమైనాయి. తెగిన కట్టకు అడ్డువేయాలని సాహసించిన యువకులు కొందరు బలి అయినారు. ఇందులో నాగరాజు తప్పెంత బావా!— అతని లక్ష్యం గొప్పది. అతని కృషి అంతకంటే గొప్పది. అయితే కట్ట కట్టడానికి ఎన్నుకున్న చోటే పనికిరానిది. అందుకే నాగరాజును చూచి నలుగురూ నవ్వినారు. హేళన చేసినారు. అప్పుడనుకొన్నాడు నాగరాజు నాగులేరుకంటే నక్కలేరేనయమని!''

"అయితే నన్నిప్పుడేం చేయమంటావు లతా?''

ఆ మాట అడుగుతూంటే చెట్టుమీద వాలిన ఒక పిట్ట రెట్టవేసింది. ఆ రెట్ట సరిగ్గా నా నెత్తినే పడింది.

కిలకిలా నవ్వింది పుష్పలత!


ఆమె నవ్వుతున్నదెందుకో తెలుసు. అందుకే ఆమెవైపు కోపంగా చూచినాను. గ్రహించింది ఆమె!

"ఇప్పుడేం చేస్తావ్ బావా ?''

"దేనికేం చేయాలంటావ్ ?''

"పిట్ట నెత్తిన రెట్ట వేసింది కదా ?''

"ఏం చేస్తాను ?... తుడుచుకొంటాను.''







"అంతేకదా ?... పిట్ట రెట్ట వేస్తుందా ? అని ఎగిరెగిరి పడవు. ఏడవవు. లేదా పైకెగిరి ఆ పిట్టను కొట్టలేవు. నోరు కదపకుండా తుడుచు కొంటావు. అదే విధంగా గుండెల్లో అనుభూతుల్ని కూడా తుడుచుకోమంటాను."

"అదెట్లా సాధ్యపడుతుంది లతా ?"

"ఎందుకు సాధ్యం కాదు బావా ? చావు బ్రదుకుల్లో వున్న రోగిని తీసుకవస్తే ప్రాణదానం చేసిన డాక్టర్ లాంటివాడివి. నలుగురి కాళ్ళకింద పడి నలిగిపోవలసిన అడవి పూలను శివుని శిరస్సున చేర్చిన పూజారి లాంటివాడివి. పదిమంది కాళ్ళకింద పడి నలుగుతున్న మట్టికి మహత్తు కల్పించిన మహనీయుడిలాంటివాడివి. విచ్చలవిడిగా పారుతున్న యేటికి ఆనకట్టను కట్టి ఒక ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని కాంక్షించిన యింజనీరు లాంటివాడివి, నీచేతనే కాకపోతే..."

"నా సంగతి అటుంచు లతా !—నేను లేకుంటే తాను బ్రతకలేనన్నదే !"

"అవసరం బావా ! అవసరం హత్యల్నే చేయిస్తుంటే... మాటలకేం కొదవ ?"

"అనకూడదు కానీ లతా ! ఏకాంతములో ఏకశయ్యమీద పొందవలసిన అనుభూతినంతా పొంది ఆ అనుభూతిలోనే జీవితం ఆఖరయితే ఎంత హాయిగా ఉంటుందో అని కలవరింతల్లో పలవరించిందే !"

"మగవాణ్ణి నమ్మించడానికి ఆడదానికి అంత కంటే అనువైన చోటు లేదు బావా !"

"పోనీ ! — చలం హీరో అమీరంతటి అదృష్ట వంతుణ్ణి కాకపోయినా లతా ! ఒక రోజు, పూట గడవడానికి యిద్దరు కలిసి వేటాడుతున్న రోజుల్లో ఒక రోజు. ఒకానొక పారిశ్రామిక మిత్రుడింటికి వెళ్ళినాము. మేము వెళ్ళింది యాచకానికే అనుకో ! అయినా ఆ మిత్రుడు భోజరాజులా ఆదరించినాడు. ఆతిథ్యమిచ్చినాడు. అడిగిందీ యిచ్చినాడు. ఆనందాన్ని మోసుకొని ఆ రాత్రి అతనింటినుండి బయలు దేరినాం. దాదాపు మైలు దూరం నడిస్తేనే కానీ బస్సు అందదు. నడుస్తున్నాము. పుచ్చపూసినట్లున్న పండు వెన్నెల్లో తడుస్తున్నాము. ఆ మైదానంలో మనుష్యులు కంట పడకపోయేసరికి మైమరుస్తున్నాము. లతా ! ఆ మైదానం గుండెల్ని చీల్చుకపోతూ రైలు బాట. ఆ రైలుబాటే ఆ రాత్రి మాకు

# చెట్టంత మనిషి

పూలపాన్పు అయిందంటే నమ్ముతావా ?"

"లోకంలో ఎన్నో నమ్మలేని విషయాలు జరిగి పోతున్నాయి. అందులో నిజమే ఉందనుకో ! — ఆ నిజం కోసం నీవు వివేకాన్ని కోల్పోతావా ?"

"అదెట్లా కోల్పోతాను ?"

"కోల్పోయినావు కాబట్టే కేవలం శారీరకమైన అనుభూతుల్ని మాత్రమే నెమరువేసుకొంటూ నలిగి పోతున్నావు."

"పిచ్చిదానా ! శారీరకమైన అనుభవాలా ? — ఆమాటకొస్తే అందులో యిద్దరంవూ యిద్దరంవే !— తలదన్నే దొకరైతే తాటిని తన్నేవాళ్ళింకొకరం !"

"మరెందుకీ మథన ?"

"ఈ మథన మానసికమయింది. నేను తనకు. నాకు తాను. ఈ ప్రపంచములో మేమిద్దరమే ! మేమిద్దరేమే ఈ ప్రపంచం. ఈ ప్రపంచములో నిత్యమయిందీ, సత్యమయిందీ మా అనురాగ మొక్కటే ! అందుకే ఆమె మాటిమాటికీ అంటూ ఉండేది — నా చేతుల్లోనే ప్రాణం వదలాలని !"

"ఆమె చేతుల్లో నీవా ? లేదు. నీ చేతుల్లో ఆమెనా ? అని నిర్ణయించేది మీరు కాదు."

## 60 వ్యాధులని గుర్తించే పరికరం !

రక్త, మూత్ర, యితర పరీక్షల ద్వారా అంటు వ్యాధులను అతి త్వరగా గుర్తించే పరికరాన్ని జపాను శాస్త్రవేత్తలు తయారు చేశారు. ప్రస్తుతం అమలులోవున్న పద్ధతుల ద్వారా ఒకేరోగ నిర్ధారణకు నాలుగు పరీక్షలు చేయ వలసి వుంటుంది. కాని దీని ద్వారా ఒకే సారి నలభై వ్యాధులను రెండు, మూడు సెకండ్లలో గుర్తింప వచ్చు. దీని యందు క్రొమాటొగ్రాఫిక్, స్పెక్ట్రొగ్రాఫిక్ పరికరాలతో పాటు ఒక చిన్న కంప్యూటరును ఉప యోగిస్తారు. ప్రస్తుతం పరిశీలనలో వున్న పరికరం ద్వారా దాదాపు అరవై రకాల వ్యాధులను గుర్తించటానికి వీలవుతుంది.

"కాదు కాబట్టే కదా ఈ యేడుపంతా !"

"అదే అనవసరమంటున్నాను."

"లతా ! కలలో యిలలో, మాటలో మనస్సులో, పూజలో పునస్కారాల్లో పునిస్త్రీగా పోవాలను కొంటుంది ఒక స్త్రీ. అదొక అదృష్టమనుకొం టుంది కూడా. అయితే ఆమె ఆశించినదానికి విరుద్ధంగా అయిదవతనం పోగొట్టుకొంటుంది. ఆమె మానసిక ఆవేదన ఎట్లా వుంటుందంటావ్ ?"

"ఆడదాన్ని ! — నన్నే అడుగుతున్నావా బావా ఈ ప్రశ్న. సరే ! యిక్కడ నీవు గమనించవలసిన విషయం ఒకటుంది. పునిస్త్రీగా పోవాలనుకొన్న స్త్రీ తన భర్తను తాను చేజేతులా చంపుకోదు."

"అంటే ?"

"అంటే నా బావా ? ఆమెకు ఆమెగా దూర మయింది కానీ — నీవు దూరం చేయలేదు కదా ?"

"అవును."

"అందుకే మరచిపొమ్మంటాను."

"మరచిపోతాను లతా !... మరచిపోతాను. కానీ తాను మరొకరి ప్రక్కన చేరితే..."

ఆ మాట అంటూవుంటే — అరవిరిసిన పువ్వులా నవ్వింది పుష్పలత.

నవ్వుతూ నావైపు జాలిగా చూచింది పుష్పలత ! —

"ఇంత బేలవవుతావనుకోలేదు బావా ?"

"బేలనైనాను కాబట్టే చూస్తూ సహిస్తు న్నాను."

"ఎంత పిచ్చోడివి బావా నువ్వు. ఏమయింది నీ అవగాహనాశక్తి ? — ఆ చెట్టును చూడు బావా ! — ఆ చెట్టును చుట్టుకొని పైకి ప్రాకుతున్న లతను చూడు బావా ! — ఆ చెట్టుమీది ప్రేమతో కాదు బావా ఆ లత ఆ చెట్టును చుట్టుకొనింది — ఆధారం కోసం. ఆ తీగను అలానే గమనించు. ఆ చెట్టును దాటి పైకి ప్రాకింది. ఆధారం కోసం మరో చెట్టును ఆశ్రయిస్తూ ఉంది. అది దాని స్వభావం. తన్ను కాదని ఆ లత మరొక చెట్టును ఆశ్రయిస్తున్న దని ఈ చెట్టు కుంగడంలేదు. కుమలడమూలేదు. ఎంతో నిబ్బరంగానే నిలబడి ఉంది. ఇదే బావా ! మనిషికి ప్రకృతి యిస్తున్న సందేశం ! — ఇప్పటి కయినా తీరిందా నీ సందేహం ?"

ఒక్క ఊపులో కృతనిశ్చయంతో పైకి లేచినాను చెట్టంత మనిషి కావాలని ! ★